

దివిటీల వెలుగులో..

మొహర్రంను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దివిటీల వెలుగులో పీర్లను ఊరేగించారు. షియా మతస్తులు మాతం నిర్వహిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. 8లో▸



దిగువకు వే'గంగా'..

సుంకేసుల జలాశయం నుంచి తుంగభద్ర జలాలు వేగంగా దిగువకు వెళ్తున్నాయి. కేసీ కెనాల్‌కు నీటి విడుదల చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన ఇవ్వలేదు. 8లో▸



తెలుగుగంగ కాలువలకు గండ్లు

తెలుగుగంగ ఉప కాలువలకు రెండు చోట్ల గండ్లు పడ్డాయి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ ఏడాది రైతులే సొంత ఖర్చులతో గండ్లను పూడ్చుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు తొలి ఏకాదశి

మహానంది: జిల్లాలో ఆదివారం తొలి ఏకాదశి పండుగ జరుపుకోనున్నారు. ఈ రోజున విష్ణు సహస్రనామ పారాయణం చేస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. పండుగ రోజు పేల పిండిని తినడం సంప్రదాయం. ఆదివారం ఉపవాసంలో ఉండి సోమవారం సమీప ఆలయాలకు వెళ్లి దీక్ష విరమిస్తారు. పండుగ నేపథ్యంలో మహానంది దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అంటారని, ఇక్కడి నుంచే అన్ని పండుగలు మొదలవుతాయన్నారు. దీన్నే శయన ఏకాదశిగా పిలుచుకుంటారని చెప్పారు. ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు విష్ణుమూర్తి పాలకడలి మీద నిద్రిస్తారని పురాణాల్లో చెప్పారన్నారు. తొలి ఏకాదశి రోజున సాక్షాత్తూ దేవతలు సైతం ఉపవాసం ఉంటూ వైకుంఠ నారాయణుడిని ఆరాధిస్తారని పురాణం చెబుతోందన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నేడు నీటి విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్

జూపాడుబంగ్లా: రైతులు, వైఎస్సార్‌సీపీ, ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో ఆదివారం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీరు విడుదల చేయనున్నారు. గతేడాది జులై 27న శ్రీశైలం జలాశయంలో 864.0 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల చేశారు. ఈ ఏడాది శ్రీశైలం జలాశయంలో శనివారం సాయంత్రానికి 877.40అడుగుల నీటిమట్టం చేరినా గేట్లు ఎత్తకపోవటంతో ఆందోళనలు చేపట్టారు. నాయకులు, రైతుల ఆందోళనలు ఉధృతమవుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటివిడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు అధికారులు శనివారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద కృష్ణమ్మకు పూజలు నిర్వహించి గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు పోతిరెడ్డిపాడు డీఈ నాగేంద్రకుమార్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు

నంద్యాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నంద్యాల జిల్లా వాసులకు చోటుదక్కింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన హరినాథ్ రెడ్డి రాష్ట్ర పంచాయతీ రాజ్‌వింగ్ కార్యదర్శిగా, డోన్ చెందిన పాలం మహేశ్వరరెడ్డిని రాష్ట్ర పంచాయతీరాజ్ జాయింట్ సెక్రటరీగా నియమించారు. అలాగే డోన్‌కు చెందిన జిల్లెల నవిత పుష్పలతను రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ జనరల్ సెక్రటరీగా నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.



బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరుకు నాలుగు రోజుల క్రితం కొంత యూరియా వచ్చింది. వందలాది మంది రైతులు రావడంతో అధిక ధరతో పాటు లింకులు పెట్టారు.

కాగితాల్లో ఎరువు.. కొందామంటే కనిపించవు!

డీలర్ల ఇష్టారాజ్యం

బయోలు, ఇతర లిక్విడ్ మందులు తీసుకుంటేనే యూరియా ఇస్తామని డీలర్లు షరతు పెడుతున్నారు. బస్తా యూరియా ధర రూ.263. ఇప్పటికే యూరియా రూ.300 ధరతో విక్రయిస్తూ.. రూ.500–750 విలువ బయోలు, ఇతర లిక్విడ్ మందులు కొనాల్సి వస్తోంది. లింకు లేకుండా యూరియా తీసుకోవాలంటే బస్తాకు రూ.350 పైనే చెల్లించాల్సి ఉంటోంది.

15,284.616 టన్నులు యూరియా ఓపెనింగ్ బ్యాలెన్స్

7,107.46 టన్నులు గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాకు వచ్చిన యూరియా

22,392.076 టన్నులు మొత్తం అందుబాటులోని యూరియా

8,174.702 టన్నులు ఇప్పటి వరకు విక్రయించిన యూరియా

14,217.374 టన్నులు అధికారిక లెక్కల ప్రకారం మిగిలిన యూరియా

వాస్తవ పరిస్థితి చూస్తే ఆర్‌బీకేల్లో ఎక్కడా ఒక్క యూరియా బస్తా దొరకని పరిస్థితి ఉంది.

మార్క్‌ఫెడ్ నుంచి దారిమళ్లుతున్న ఎరువులు

- ఆర్‌బీకేల పేరిట ఎగరేసుకుపోతున్న టీడీపీ నేతలు
- అమ్మకాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రయివేటు డీలర్లు
- బయోలు, ఇతర ల్విక్విడ్ మందులతో లింకు
- పత్తి సాగు పెరుగుతుండటంతో యూరియాకు డిమాండ్
- పొంతనలేని వ్యవసాయ యంత్రాంగం లెక్కలు

ఎరువులు బ్లాక్‌లో కొంటున్నాం



గత ఏడాది ఏప్రిల్ వరకు ఆర్‌బీకేల్లోనే అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు లభించేవి. ఆ తర్వాత నుంచి ఆర్‌బీకేల్లో ఎరువులే పెట్టడం లేదు. వీటికోసం ఇప్పుడు కర్నూలుకు పోవాల్సి వస్తోంది. అక్కడ కూడా బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. బస్తా ధర రూ.263 ఉంటే బ్లాక్‌లో రూ.330 ప్రకారం కొనుగోలు చేశాం. మన గ్రోమోర్ సెంటర్లలో 10.26–26, 28–28–0 ఎరువులకు ఇతర ఉత్పత్తులు తీసుకోవాలనే లింక్ పెడుతున్నారు.

– పరమేశ్వరరెడ్డి, రేమదూరు, కల్లూరు మండలం

యూరియా దొరకడం లేదు



ఈ ఖరీఫ్‌లో 25 ఎకరాల్లో వరి సాగు చేయనున్నాం. ఆర్‌బీకేలో యూరియా సహా ఎలాంటి ఎరువులు లేవు. సొసైటీలకు అరకొరగా ఇస్తుండటం వల్ల పప్పులు, బెల్లాలు పంచినట్లుగా ఉంది. యూరియా కోసం పడిగాపులు కాస్తున్నాం. ప్రైవేటు డీలర్ల దగ్గర కూడా యూరియా లేదు. ఎవరిదగ్గరైనా ఉంటే బస్తాపై రూ.100 అధిక ధర చెబుతున్నారు. దీంతో పాటు లింక్ కింద బయోలు అంటగడుతున్నారు.

– పిట్టం రామలింగేశ్వరరెడ్డి, ఈర్నపాడు, బండి ఆత్మకూరు మండలం

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా యూరియా కొరత ఏర్పడింది. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు చేరుతున్న యూరియా మొత్తాన్ని కూటమి పార్టీల నేతలే తరలించుకుపోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయివేటు డీలర్లు బయోలు, ఇతర లిక్విడ్ మందులు తీసుకుంటేనే యూరియా ఇస్తామనే షరతు విధిస్తున్నారు. మార్క్‌ఫెడ్‌లో ఉన్న యూరియా పక్కదారి పడుతోంది. డిమాండ్‌ను బట్టి ఇటు తెలంగాణ, అటు కర్ణాటక రాష్ట్రాలకు తరలుతోంది. రసాయన ఎరువులు ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటైనా ఫలితం లేకపోతోంది. యూరియా అమ్మకాల్లో అక్రమాలను అడ్డుకోవడంలో వ్యవసాయ శాఖ చేతులెత్తేసింది. కర్నూలు జిల్లాలో ప్రధానంగా పత్తి సాగవుతోంది. ఇప్పటికే దాదాపు 55వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. మరో 1.75 లక్షల హెక్టార్ల వరకు సాగయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం వర్షాలు నిరాశజనకంగా ఉన్నాయి. ఇలాంటి సమయంలోనే యూరియాకు డిమాండ్ ఏర్పడిందంటే.. రానున్న రోజుల్లో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు.



రసాయన ఎరువుల బస్తాలు

యూరియాపై టీడీపీ నేతల పెత్తనం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో యూరియాపై టీడీపీ నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో యూరియా కొరత లేకుండా ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచింది. కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసింది. వీటిల్లో ఒక్క యూరియానే కాదు.. రసాయన ఎరువులు కూడా కనిపించని పరిస్థితి. ఉమ్మడి జిల్లాకు వచ్చే ఎరువుల్లో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, మిగిలిన 50 శాతం ప్రయివేటు డీలర్లకు ఇస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కు ఇచ్చిన ఎరువులను ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లకు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పటైన తర్వాత మార్క్‌ఫెడ్ నుంచి రసాయన ఎరువులు దారిమళ్లుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా యూరియా ఆర్‌బీకేల పేరుతో ప్రయివేటు డీలర్లు, టీడీపీ నేతల ఇళ్లకు చేరుతున్నట్లు సమాచారం.

పెరిగిన ఎరువులు వినియోగం

ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు పడటంతో రసాయన ఎరువుల వినియోగం భారీగా పెరిగింది. యూరియా సహా రసాయన ఎరువులకు ఎలాంటి కొరత లేదని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం యూరియా కొరత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రధానంగా కల్లూరు, కర్నూలు, వెల్దుర్తి, దేవనకొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, సీ.బెళగల్ తదితర మండలాల్లో యూరియా కొరత ఏర్పడింది. కొంతమంది ప్రయివేటు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి లింకులు పెట్టడంతో పాటు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు 18వేల టన్నులు మాత్రమే వినియోగించారు. ఈసారి ముందస్తుగా అంటే మే నెల నుంచే వర్షాలు పడుతుండటంతో ఎరువుల వినియోగం పెరిగింది. గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు అన్ని రకాల రసాయన ఎరువులు 25,420.746 మెట్రిక్ టన్నులు వినియోగించారు. ఇందులో ఒక్క యూరియా మాత్రమే 8174.702 టన్నులు వినియోగించడం గమనార్హం. తాజాగా ఎక్కడా యూరియా దొరక్కపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

☛ నంద్యాల జిల్లాలో కూడా కాగితాల్లో ఎరువుల నిల్వలు భారీగా ఉన్నట్లు కనిపిస్తున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా జాడలేని పరిస్థితి. ఓపెనింగ్ బ్యాలెన్స్‌తో పాటు ఇప్పటి వరకు వచ్చిన యూరియా 31,059 టన్నులు. ఇప్పటి వరకు 12,433.1 టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. మరో 18,626 టన్నులు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నా.. రైతులు యూరియా దొరకడం లేదని గగ్గోలు పెడుతుండటం గమనార్హం.

గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎరువుల వినియోగం ఇలా.. (టన్నుల్లో)

	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
యూరియా	8174.702	12,433.1
డీఏపీ	2302.425	1470.36
ఎంవోపీ	248.300	1568.05
కాంప్లెక్స్ (ఎన్‌పీకేఎస్)	14262.719	11885.2
ఎస్‌ఎస్‌పీ	432.600	825.595
మొత్తం	25,420.746	28,182

ఇద్దరు గ్రేడ్ -1 వీడీఓలకు ఏఓలుగా పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 వీడీఓలుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరికి పరిపాలనాధికారులుగా పదోన్నతి కల్పించి మండల పరిషత్ కార్యాలయాలకు పోస్టింగ్స్ ఇచ్చారు. జెడ్పీలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-1 వీడీఓ జి.శ్రీనివాసులును కొత్తాళం మండల పరిషత్ కార్యాలయ ఏఓగా, శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-1 వీడీఓ)గా పనిచేస్తున్న పి.హరిశివలీలను కోసిగి మండల పరిషత్ కార్యాలయ ఏఓగా నియమిస్తూ జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సత్వర న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం

12,558 కేసుల పరిష్కారం

కర్నూలు(సెంట్రల్): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎప్పటినుంచో పరిష్కారానికి నోచుకోని భూసేకరణ కేసుల్లో నష్టపరిహారం చెక్కులను ఈ సందర్భంగా అందజేశారు. ఈ సంవత్సరంలో రెండోసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎల్‌వీ శేషాద్రి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 బెంచీలు ఏర్పాటు చేసి 12,558 కేసులు పరిష్కరించామన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చొరవతో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిందన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు కమలాదేవి, వాసు, శ్రీవిద్య, అదనపు సబ్ జడ్జి దివాకర్, జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పోలీస్, బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



రైతులకు నష్టపరిహారం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు

- మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట
- తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి

కల్లూరు: ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని ఆ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. కర్నూలు నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం పాణ్యం నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పోస్టర్లను ఆవిష్కరించారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 'క్యూఆర్ ' కోడ్‌ను స్కాన్ చేస్తే ప్రతి కుటుంబం ఏడాది కాలంలో ఎంత నష్టపోయిందో తెలుస్తుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ (పార్టీ నంద్యాల పార్లమెంటరీ పరిశీలకులు) కల్పలత రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

'సూపర్' మోసం

కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత తల్లికి వందం పథకం ఇచ్చారని, అది కూడా అందరికీ అందలేదన్నారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ పథకాలు మరచిపోయారన్నారు. 'రెడ్‌బుక్' పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు దుక్కుతుందన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టు భారతదేశంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చూపిద్దాం

రాబోయే కాలంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు రానున్నాయని, అన్ని స్థానాల్లో విజయం సాధించి వైఎస్సార్‌సీపీ సత్తా చూపిద్దామని ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకతను తెచ్చుకుందన్నారు. 'కూటమి' నేతల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని, రాబోయే కాలంలో జగనన్న రాజ్యం వస్తుందని, ప్రజా సంక్షేమంతో పాటు నాయకులకు, కార్యకర్తలందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

మేనిఫెస్టోను మరచిపోయారు

ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను టీడీపీ అధినేత చంద్రబాబు మరచిపోయారని ఎమ్మెల్సీ (నంద్యాల పార్లమెంటరీ పరిశీలకులు) కల్పలతరెడ్డి విమర్శించారు. 2014–2019 కాలంలో టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్‌ను తీసివేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినా సుగాలిప్రీతి తల్లిదండ్రులకు న్యాయం జరగలేదన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టు నిండా నీళ్లు ఉన్నా హంద్రీనీవా కాలువకు, గోరుకల్లు రిజర్వాయర్‌కు నీళ్లు రాక రైతులు నష్టపోతున్నారన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. హామీలు అమలు చేయకుండా ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలకు రూ. 85 వేల కోట్లు మోసం చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అంటే వెన్నుపోటు, మోసం, అబద్ధాలు గుర్తుకు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీలు, కల్లూరు అర్బన్ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారు పాల్గొన్నారు.

10న 'పేరెంట్స్ , టీచర్స్ మీట్'

నంద్యాల: జిల్లా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో మోగా పేరెంట్స్ టీచర్స్ మీట్ (పీటీఎం 2.0) కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీన నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులందరికీ గత సంవత్సరంలో సాధించిన ఫలితాలపై ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు అందించాలని తెలిపారు. ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులో 'తల్లికి వందనం' ఎంత జమ అయ్యిందనే వివరాలు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లీప్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు మొక్కలు అందజేసి 'ఏక్ పేడ్ మాకే నామ్' (తల్లి పేరు మీద మొక్క)ను నాటించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మిత్రా కిట్స్‌ను అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఆహ్వానం అందజేశాలని పేర్కొన్నారు.

269 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్-5), డిజిటల్ అసిస్టెంట్ (గ్రేడ్-6)లకు సంబంధించిన బదిలీల ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రేడ్ -5కు సంబంధించి ఐదు సంవత్సరాలు ఒకే ప్రాంతంలో సర్వీసు పూర్తి చేసుకున్న 27 మందితో పాటు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ కింద 9, అంతర్ జిల్లా బదిలీల్లో భాగంగా ఒకరిని వేర్వేరు మండలాలకు బదిలీ చేశామన్నారు. అలాగే గ్రేడ్-6కు సంబంధించి ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పనిచేసిన 196 మందితో పాటు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ కింద 11, అంతర్ జిల్లా బదిలీల్లో భాగంగా 25 మందిని బదిలీ చేసినట్లు తెలిపారు. గ్రేడ్-5, 6 కలిపి మొత్తం 269 మందికి స్థాన చలనం కల్పించినట్లు డీపీఓ వెల్లడించారు.

ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం

కర్నూలు(అగ్రికల్చర్): జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు 62 రోజుల పాటు తుంగభద్ర నది, సుంకేసుల బ్యారేజీ, వాటి ఉప నదుల్లో చేపల వేటను నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు వివి రంగనాథ్‌బాబు తెలిపారు. ఈ సమయం సహజంగా చేపల సంతానోత్పత్తి కాలమని, వేట వల్ల సంతానోత్పత్తికి విఘాతం కలుగుతుందని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతానోత్పత్తి బాగా జరిగి చేపలు వృద్ధి చెందితే మత్స్యకారులకే లాభదాయకమన్నారు. ఆయా జలాశయాల్లో లైసెన్స్‌దారులు ఏ ఒక్కరు చేపల వేట చేయరాదని పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా వేట సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం


ప్రారంభమైన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నంది గ్రూప్ ఆఫ్ సంస్థ ఎండీ సుజల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడల వల్ల ఉల్లాసం ఉంటుందన్నారు. ప్రతి రోజూ క్రీడలు దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వంశీధర్ మాట్లాడుతూ 6వ తేదీన 11, 13, 15, 17, 19 సంవత్సరాల బాలబాలికలకు, పురుషుల విభాగంలో సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్‌గా లక్ష్మీనరసింహ


లక్ష్మీనరసింహ యాదవ్

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్‌గా నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యులు జంగిటి లక్ష్మీనరసింహయాదవ్‌ను నియమించారు. ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్ స్థానంలో జె.లక్ష్మీనరసింహయాదవ్‌ను ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి నియమించారు. ఇక్కడ డీసీసీగా ఉన్న మురళీకృష్ణను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో మూడు నెలలుగా పోస్టు ఖాళీగా ఉంది. అప్పటి నుంచి అంబటి రామకృష్ణయాదవ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న స్థానంలో నంద్యాల డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నలక్ష్మీనరసింహ యాదవ్‌కు స్థానం కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వినోద్ మృతదేహం

బనగానపల్లె రూరల్: పట్టణంలో టిప్పర్ ఢీకొని వినోద్(30) మృతి చెందాడు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. చక్రవర్తి ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసం ఉంటున్న వినోద్ శుక్రవారం రాత్రి పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా చేపల మార్కెట్ సమీపంలో ఫోన్ రావడంతో సైడ్‌కు నిలిపి మాట్లాడుకుంటూ ఉన్నాడు. ఇదే సమయంలో కొండపేట నుంచి పట్టణంలోకి వస్తున్న టిప్పర్.. రోడ్డు సైడ్ ఫోన్ మాట్లాడుతున్న వినోద్‌ను ఢీకొట్టి, అతని శరీరంపై వెళ్లింది. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు వినోద్ జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీలో రోజువారి కార్మికుడిగా పనిచేస్తున్నారు. భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చేపల వేటలో నీటికొంగలు


వల వేస్తున్న జాలర్లు


వరద నీటితో జలకళను సంతరించుకున్న సుంకేసుల డ్యామ్

దిగువకు వే'గంగా'..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షం ఒకచోట కురిసి మరో చోట కనిపించడం లేదు. కర్ణాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. టీబీ డ్యాం నుంచి వదిలిన నీరు సుంకేసుల డ్యామ్‌కు భారీగా వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 1.235 టీఎంసీ కాగా పూర్తిస్థాయిలో నిండింది. అయితే వచ్చిన నీటిని కేసీ కెనాల్‌కు, కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు వదలకుండా దిగువకు వదిలేస్తున్నారు. ఇందుకోసం సుంకేసుల జలాశయం అన్ని గేట్లు ఎత్తేశారు. కేసీ కాల్వకు నీరు వస్తే పంటలు వేసుకోవాలని రైతులు ఎదురు చూస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో సాగుపై ఆశలు వదులుకున్నారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


సుంకేసుల డ్యామ్ గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరద నీళ్లు

9న తెరుచుకోనున్న శ్రీశైలం గేట్లు?

- ఈనెల 12న హంద్రీనీవాకు నీటి విడుదలకు అవకాశం

కర్నూలు(సిటీ): తుంగభద్ర, కృష్ణా నదుల నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి వస్తున్న నీటిలో సగానికి పైగా శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో వారం రోజుల క్రితమే రిజర్వాయర్ నిండే అవకాశం ఉన్నా విద్యుదుత్పత్తి వల్ల ఈ పరిస్థితి లేకపోయింది. అయితే తుంగభద్ర, కృష్ణా నదుల నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో ఈనెల 9న శ్రీశైలం గేట్లు ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నట్లు అనధికారిక సమాచారం. ఇదిలాఉంటే శ్రీశైలం రిజర్వాయర్‌లో హంద్రీనీవాకు నీరిచ్చేంత నీటి మట్టం వారం పది రోజుల క్రితమే వచ్చినప్పటికీ హంద్రీ నీవా కాలువలో జరుగుతున్న విస్తరణ పనుల వల్ల నీరు ఇవ్వలేకపోయారు. వాస్తవానికి పనులు గత నెల 10 నాటికే పూర్తి కావాల్సి ఉంది. శనివారం హంద్రీనీవా పనులపై సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో ఈ నెల 15 నాటికి విస్తరణ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పనులు పూర్తయ్యేందుకు మూడు రోజుల ముందుగా ఈనెల 12 నుంచే హంద్రీనీవా కాలువకు నీరిచ్చేందుకు ఇంజనీర్లు సిద్ధంగా ఉండాలని సీఎం సూచించినట్లు సమాచారం.

14 మండలాల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని 14 మండలాల్లో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా 6.5 మి.మీ వర్షపాతం నమోదైంది. కౌతాళంలో 38.2 మి.మీ, కోసిగిలో 34.2, ఎమ్మిగనూరులో 27.8, నందవరంలో 17.8, సి.బెళగల్‌లో 13.6, పెద్దకడుబూరులో 12.2, కోడుమూరులో 8.2, మంత్రాలయంలో 7.8 మిమీ ప్రకారం వర్షాలు కురిశాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా.. మొదటి ఐదు రోజుల్లో 14.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా రానున్న నాలుగు రోజుల్లో వివిధ మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

తెలుగుగంగ కాలువలకు గండ్లు

- పట్టించుకోని ప్రభుత్వం
- సొంత నిధులు వెచ్చించి గండ్లు పూడ్చేందుకు యత్నిస్తున్న రైతులు


శ్రీరంగాపురం వద్ద తెలుగుగంగ 16వ బ్లాక్ గండిని చూపుతున్న రైతు

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురం వద్ద 16వ బ్లాక్ ఉప ప్రధాన కాలువలో రెండు చోట్లా గండ్లు పడ్డాయి. గత రబీ సీజన్‌లో కాలువకు సాగునీరు విడుదల చేయడంతో నీటి ప్రవాహ ఉధృతికి రెండు చోట్లా గండ్లు పడి నీరు వృథాగా పంటలపై పారింది. అప్పట్లో రైతులు గండ్లను పూడ్చాలని తెలుగుగంగ అధికారులను కోరినా రబీ అయిపోయాక వేసవిలో గండ్లను పూడ్చివేస్తామని చెప్పారు. అయితే గత రబీ సీజన్ పూర్తయ్యింది. వేసవి ముగిసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కూడా మొదలైంది. కానీ నేటి వరకు కూటమి ప్రభుత్వం గండ్లను పూడ్చలేదు. దీంతో ప్రభుత్వంపై ఆశలు వదులుకున్న రైతులు.. సొంత ఖర్చులతో జేసీబీతో గండ్లను పూడ్చుకున్నారు. పంటలను కాపాడుకునేందుకు తప్పని పరిస్థితుల్లో సొంత నిధులతో గండ్లు పూడ్చుకుంటున్నామని రైతు మధు తెలిపారు.

దివిటీల వెలుగులో పీర్ల ఊరేగింపు

- మాతం నిర్వహించిన షియా మతస్తులు
- ఘనంగా పెద్ద సరిగెత్తు


దివిటీల వెలుగులో హజరత్ అబ్బాస్ పీరుతో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

కోవెలకుంట్ల: పట్టణంలోని బసిరెడ్డిబావి వీధిలో కొలువుదీరిన హజరత్ అబ్బాస్ పీరును శుక్రవారం అర్ధరాత్రి దివిటీల వెలుగులో ఘనంగా ఊరేగించారు. ఖర్బలా మైదానంలో యజీద్‌రాజుతో జరిగిన యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనువడు ఇమాం హుసేన్ తోపాటు ఆయన కుటుంబ సభ్యుడు హజరత్ అబ్బాస్ మృతిచెందగా ఆయనను స్మరించుకుంటూ ఏటా మొహర్రం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మధ్య సరిగెత్తును పురస్కరించుకుని అర్ధరాత్రి వెయ్యి దివిటీల వెలుగులో హజరత్ అబ్బాస్ పీరును పురవీధుల గుండా ఊరేగించారు. కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల షియా మతస్తులు మాతం నిర్వహిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. హజరత్ అబ్బాస్ పీరుకు భక్తులు ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

బనగానపల్లె నియోజకవర్గంలో శనివారం పెద్దసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చిన్నబార్ ఇమాం, పెద్దబార్ ఇమాం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, గుద్దేటి వీధి తదితర ప్రాంతాల్లోని చావిళ్లలో కొలువుదీరిన ఇమాంకాశీం, బీబీఫాతిమా, అజరత్ అలీ అక్బర్, దస్తగిరిస్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్లకు భక్తులు పూలదట్టీలు సమర్పించి మొక్కులు తీర్చున్నారు. ఆయా చావిళ్ల ఎదుట అగ్ని గుండాల చుట్టూ ప్రదక్షిణలు చేసి ఫతేహాలు నిర్వహించారు. ఆదివారం పీర్ల నిమజ్జనంతో మొహ్రరం ముగియనుంది.

అంబులెన్స్ బహూకరణ


అంబులెన్స్ వద్ద శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, భక్తులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామి భక్తులు శ్రీ మఠం ఆసుపత్రి అంబులెన్స్‌ను బహూకరించారు. శనివారం స్థానిక మఠం ఆవరణలో అంబులెన్స్‌కు పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. బెంగళూరు సాఫ్ట్‌వేర్ ఏజీ కంపెనీకి వారి సౌజన్యంతో భక్తులు రవీంద్రనాయక్, కృష్ణ పురోహిత్ శ్రీ మఠం ఆసుపత్రి సుజయేంద్ర ఆరోగ్యశాలకు అంబులెన్స్‌ను అప్పగించారు. భక్తులకు ఫలపూలమాంత్రక్షాంతలతో శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి కోఆర్డినేటర్ విజేయేంద్ర రావు, మెడికల్ ఆఫీసర్ సుదేంద్ర పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు


జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): జంతవుల నుంచి మనుష్యులకు, మనుష్యుల నుంచి జంతవులకు సంక్రమించే వాటిని జూనోసిస్ వ్యాధులుగా వ్యవహరిస్తారు. దాదాపు 280 వ్యాధులను పశువైద్యులు గుర్తించారు. 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి జూనోసిస్ వ్యాధి రాకుండా లూయిస్‌పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా టీకా మందు వేసి విజయవంతమయ్యారు. అప్పటి నుంచి ఏటా జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. చికిత్సకన్నా-నివారణే మిన్న అనే సూత్రాన్ని పాటిస్తూ పెంపుడు జంతవులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. . జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కర్నూలులోని బహుళార్థ పశువైద్యశాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్‌లో పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 36,610 డోసుల యాంటి రేబిస్ వ్యాక్సిన్ వచ్చిందని, ఇందులో కర్నూలు జిల్లాకు 13,000 డోసులు, నంద్యాల జిల్లాకు 20,700 సరఫరా అయిందని, మిగిలిన వ్యాక్సిన్ జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రంలో బఫర్‌లో ఉంటుందని తెలిపారు. వారం రోజుల పాటు టీకాలు వేయనున్నామని పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

టీడీపీకి రాజీనామా చేసిన మాజీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు రూరల్: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీకి ఇద్దరు మాజీ కౌన్సిలర్లు, పట్టణ మాజీ కార్యదర్శి శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన 29వ వార్డు మాజీ కౌన్సిలర్ మధుబాబు, పట్టణ మాజీ కార్యదర్శి చేనేత మల్లికార్జున మాట్లాడుతూ.. టీడీపీ గెలుపునకు, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి విజయానికి తాము కృషి చేస్తే తమకు అవమానాలు తప్ప గౌరవం లేకపోవటంతోనే పార్టీని వీడుతున్నామన్నారు. తమ బాటలో మరికొందరు త్వరలోనే బయటకు వస్తారన్నారు. ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, మార్చుకోవాలని చెప్పినా తమ మాటను లెక్కచేయట్లేదని.. దీంతో పార్టీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు. రాజీనామా లేఖను మంత్రి నారా లోకేశ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డిలకు పంపనున్నట్లు వారు తెలిపారు.

వాస్తవ సమాచారంతో పల్లెల పురోగతి

- జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలంటే క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక స్థితిగతులపై వాస్తవ సమాచారాన్ని అందించాల్సి ఉంటుందని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీఎస్ఐఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శనివారం స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అధికారులు, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులకు 'పంచాయతీ పురోగతి సూచిక'పై ఒక టీఓటీ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి జీ భాస్కర్, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు వెంకటరమణయ్య, రమణారెడ్డి, పీ నిర్మల, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు వీ రామచంద్రారెడ్డి, టీ నాగేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శాంతికళ, వ్యవసాయ శాఖ ఏడీ సాలురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు గ్రామాల పురోగతిపై పూర్తి స్థాయి సమాచారం పంపాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జీ భాస్కర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, జల జీవన్ మిషన్ వంటి పథకాలు పూర్తి స్థాయిలో వినియోగించబడితే వీటి ప్రభావం ప్రజల ఆర్థికపరమైన, సామాజిక స్థాయిని పెంపొందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని మండల స్థాయిల్లో జరిగే శిక్షణా కార్యక్రమాలు పూర్తయిన తర్వాత క్షేత్ర స్థాయిలో పంచాయతీ పురోగతి సూచిక వివరాలను పొందుపరచాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో డీపీఆర్‌సీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మంజులావాణి, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు అస్రఫ్ బాషా, పీ జగన్నాథం, కే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల వద్దకే మెడికల్ రిజిస్ట్రేషన్


వీఆర్‌డీఎల్ ల్యాబ్ భూమి పూజలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్, అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలులో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీలో డాక్టర్ల వద్దకే మెడికల్ రిజిస్ట్రేషన్లు తీసుకొచ్చినట్లు రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే వైద్యుల సర్టిఫికెట్ల రెన్యువల్స్‌ను మంత్రి టీజీ భరత్ శనివారం ప్రారంభించారు. అనంతరం వైరాలజీ ల్యాబోరేటరీ(వీఆర్‌డీఎల్)కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్‌లో ఉన్న ఇబ్బందులను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గతంలో వైద్యులు రెండు, మూడు రోజులు సమయం కేటాయించి మెడికల్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ చేసుకునే వారని, ఇప్పుడు వారి చెంతకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ రావడం వల్ల గంటల్లో పని పూర్తవుతుందన్నారు. వీఆర్‌డీఎల్ భవనాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.